## క్లుప్తంగా

### ఎంపీడీఓగా పురుషోత్తం



వెదురుకుప్పం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఈఓపీఆర్డీ పురుషోత్తానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న ప్రేమ్‌రాజ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం విధుల్లో చేరారు.

### క్రమశిక్షణతో బంగారు భవిష్యత్




గంగాధర నెల్లూరు: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివితే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని చిత్తూరు ఆర్డీవో సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని యట్టేరి గ్రామంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. దీనికి హాజరైన ఆర్డీవో సునీల్ కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తే ఉన్నత స్థితికి ఎదుగుతారని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

### ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం



చెరుకు పంటను పరిశీలిస్తున్న డిపిఎం వాసు

పాలసముద్రం: మండల పరిధిలోని రైతులు ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తే, ఆహార ధాన్యాలు ఎంతో ఆరోగ్యకరంగా ఉంటాయని చిత్తూరు ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. ఆయన శుక్రవారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటను సాగు చేయడం వల్ల రసాయనాల వాడకం ఉండదని చెప్పారు. జీవామృతం కషాయాలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. చెరకు పంటలో చీడపీడల నివారణకు జీవామృతం వినియోగించాలని చెప్పారు. ఈ ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంట సాగుచేసి, బెల్లం తయారీ చేస్తే, దాన్ని తిరుమల-తిరుపతి దేవస్థానానికి సరఫరా చేయవచ్చని చెప్పారు. తద్వారా రైతులకు మార్కెట్ ధర కన్నా ఐదు శాతం ఎక్కువగా టీటీడీ కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన చెరకు పంటను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

### ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శిగా మోహన్‌రెడ్డి



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘ నాయకులు

పుత్తూరు: ఎస్టీయూ తిరుపతి జిల్లా కార్యవర్గంలో పుత్తూరుకు సముచిత స్థానం లభించిందని మండల అధ్యక్షుడు మునిరాములు తెలిపారు. శుక్రవారం తిరుపతిలో జరిగిన ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన కె.మోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏ.కేశవులు, కార్యదర్శిగా ఇ.వాసు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా శోభనాదేవి, గోవర్ధనుడు, శ్రీనివాసరాజు, చంద్రయ్య, రవిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంఘ నాయకులు మోహన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశులు, యుగంధర్ పాల్గొన్నారు.

### ఆరోగ్య సురక్షకు స్పందన



బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. నరసింహపురం గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీడీఓ రామనాథరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ పేదలు తమ ఆరోగ్యంపై ఇక బెంగ పడనవసరం లేదు. ఆస్పత్రికి వెళ్లాలన్నా, మందులు కొనాలన్నా డబ్బులు చాలవేమోననే ఆందోళన అక్కర్లేదు. ఏరుగ్మత వచ్చినా యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ఆ వివరాలు నమోదు చేస్తే వెంటనే ఏఎన్ఎం ఇంటికే వచ్చి తక్షణ వైద్యసాయం అందేలా చూస్తారు. ఉపశమనం లభించకపోతే వైద్యాధికారి ఇంటి వద్దకే వస్తారన్నారు. ప్రస్తుతం నిర్వహించిన వైద్య శిబిరం 243 మంది పలు జబ్బులు ఉన్నవారికి వైద్య పరీక్షలు చేశారు. విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు సత్య నారాయణ, ధరణి, సుధ, సీహెచ్ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌సీ సూపర్ వైజర్లు సుశీల, మురళి, ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బహుత్.. సుందర్ ▸ షాదీమహల్..

- రూ.2.41 కోట్లతో నిర్మాణం
- 27 మసీదుల నవీకరణకు రూ.2కోట్లు మంజూరు
- మంత్రి రోజా మేలు మరచిపోం అంటున్న ముస్లిం మైనారిటీలు



పుత్తూరులో నిర్మించిన షాదీమహల్

పుత్తూరు: పెళ్లి చేయాలన్నా, ఇల్లు కట్టాలన్నా రెండింటికీ ఆర్థిక స్తోమత కలిగి ఉండటమే ప్రధానం. వివిధ వర్గాలకు చెందిన పేదలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలతో ఆదుకుంటోంది. ముస్లింలను 'షాదీ తోఫా'తో వారి వివాహాలకు చేయూతనిస్తోంది. ఇదే కోవలో ముస్లింల కోసం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రభుత్వం నుంచి రూ.2.41 కోట్లు మంజూరు చేయించి పుత్తూరులో షాదీ మహల్ నిర్మించారు. **యే బహుత్ సుందర్ షాదీ మహల్ హై..** అని నగరి నియోజకవర్గంలోని మైనారిటీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా నగరి నియోజకవర్గంలోని 27 మసీదుల నవీకరణకు సైతం మంత్రి రోజా రూ.2కోట్లు మంజూరు చేయించారు. మంత్రి రోజాకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును ఎప్పటికీ మరచిపోమని ముస్లిం మైనారిటీలు చెబుతున్నారు.

#### జీవితాంతం రుణపడి ఉంటాం



కోట్ల రూపాయలతో షాదీమహల్ నిర్మించడం మా ముస్లింలందరికీ గర్వకారణం. మా పేద కుటుంబాల్లో సంతోషం నింపిన మంత్రి రోజాకు జీవితాంతం రుణపడి ఉంటాం. కులాలు, మతాలు చూడకుండా అందరికీ మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నాం. నగరిలో వైఎస్సార్ సీపీని గెలిపిస్తాం. -వి.షకీల, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్, మేదరవీధి, పుత్తూరు

#### పేదల కుటుంబాల్లో ధైర్యం



పేద ముస్లిం కుటుంబాల్లో ధైర్యం నింపారు. షాదీ పేరుతో మాపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించారు. షాదీమహల్ కట్టడానికి కారకులైన మంత్రి రోజమ్మకు, సీఎం జగనన్న ఎంతో మంచి చేస్తున్నారు. వారు రాజకీయాల్లో చిరకాలం ఉండాలి. దీనికి మా సహకారం వారికి ఎప్పుడూ ఉంటుంది.

-జకీరాబేగం, షాపు స్ట్రీట్, పుత్తూరు

#### ముస్లింలకు సముచిత స్థానం



జగనన్న పాలనలోనే ముస్లింలకు సముచిత స్థానం దక్కింది. అలాగే ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు అవకాశాలను కల్పిస్తున్నారు. గతంలో ముస్లింలను ఓటుబ్యాంకుగా ఎన్నికల సమయంలో మాత్రమే వాడుకునేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అందుకు భిన్నం. ముస్లింల అభ్యున్నతికి కూడా ఎంతగానో పాటుపడుతోంది. -సైపుల్లా, గేట్‌పుత్తూరు

#### మంత్రి రోజమ్మ మేలు మరువం



తొలినుంచి ముస్లింల అభ్యున్నతికి సహకరిస్తున్న మంత్రి రోజమ్మ మేలును ఎన్నటికీ మరువం. ఆమె చొరవతోనే పుత్తూరులో షాదీమహల్ గొప్పా కట్టారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సైతం ఆమె అంగీకరించారు. నగరి నియోజకవర్గంలోని అన్ని మసీదుల అభివృద్ధికి ఆమె బాధ్యత తీసుకోవడం ఆమెకు ముస్లింలంటే ఉన్న ప్రత్యేక అభిమానాన్ని తెలియజేస్తోంది. -ఎస్.ఏ.ఇలియాస్, చైర్మన్, మసిజిదయే ముఖద్దస్ మసీదు, గేట్ పుత్తూరు

#### వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే న్యాయం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ముస్లింలకు న్యాయం జరుగుతోంది. సీఎం జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజమ్మ నగరిలోని మీరాసాహెబ్‌పాళెం గ్రామాన్ని దత్తతకు తీసుకోవడం మాకెంతో ఆనందం. పుత్తూరులో షాదీమహల్ నిర్మాణం ఆమెకు మైనారిటీల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

-బి.మహ్మద్ అలీ, ఎన్జీఓ కాలనీ, పుత్తూరు

## సిద్ధం సభకు మద్దతుగా భారీ బైక్‌ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

శ్రీరంగరాజపురం: అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 18న నిర్వహించనున్న సిద్ధం సభకు సంఘీభావంగా శుక్రవారం మండలంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి నేతృత్వంలో ఈ ర్యాలీ చొక్కమడుగు నుంచి కొత్తపల్లె మిట్ట వరకు సాగింది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మణి, మాజీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ఎంపీపీ సరిత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్వర్టు పనులకు భూమి పూజ



దెబ్బతిన్న నేసనూరు కల్వర్టును పరిశీలిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: మండలంలోని నేసనూరు గ్రామ కల్వర్టు మరమ్మతులకు శుక్రవారం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ, ఎఫ్‌డీఆర్ గ్రాంట్ రూ.15 లక్షలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇటీవల భారీ వర్షాలకు కల్వర్టు దెబ్బతిన్న నేపథ్యంలో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధి సాయం పంపిణీ



బాధితునికి చెక్కు అందజేస్తున్న మంత్రి

నగరి: వడమాలపేట మండలం, బేరివాని కండ్రిగకు చెందిన మునస్వామి భార్య మంజుల డెంగీ జ్వరం బారిన పడి తీవ్ర అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వైద్యం కోసం చేసిన వ్యయం చెల్లించాలని మునస్వామి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజాకు తమ సమస్యను నివేదించారు. స్పందించిన ఆమె సీఎం సహాయ నిధి నుంచి రూ. 4 లక్షలను మంజూరు చేయించారు. శుక్రవారం తన నివాస కార్యాలయం వద్ద ఈ చెక్కును మునస్వామికి అందజేశారు.

## కల్యాణం.. కమనీయం




సీతారాముల వారికి కల్యాణ హారతి

పుత్తూరు: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామ జన్మభూమి భవ్య దివ్య మందిరం ప్రారంభమైన నేపథ్యంలో రథసప్తమి పురస్కరించుకుని సీతారాముల ఉత్సవ విగ్రహాలతో కల్యాణం నిర్వహించారు. తొలుత కలశ ప్రతిష్ఠ చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, విశేష సర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి వధూవరులుగా కొలువు దీర్చారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం నిర్వహించారు. స్థానిక ఆడిటర్ రామకృష్ణ, తిరుపతికి చెందిన సంస్కార ఫౌండేషన్ సౌజన్యంతో ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రాజు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా రథసప్తమి కల్యాణోత్సవం







కల్యాణోత్స పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు భక్తులతో పాటు కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న మంత్రి ఆర్కేరోజా, కార్వేటినగరంలో.. కరివరదరాజ ఆలయంలో..

నగరి: స్థానిక టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్య స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి కల్యాణోత్సవం వైభవంగా కనుల పండువగా నిర్వహించారు. తొలుత ఉదయం అభిషేకం, తోమాల సేవ, తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామి ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ, సాయంత్రం అర్చకుల వేదమంత్రోచ్ఛరణ, భక్తజన సందోహం నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. టీటీడీ అధికారులు స్వామివార్లకు పట్టుపీతాంబరాలు సమర్పించారు. హాజరైన మంత్రి ఆర్కేరోజాకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కల్యాణోత్సవం సందర్భంగా అర్చకులు నిర్వహించిన ఆనంద నృత్యాలు, పూబంతుల ఆటలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్థానిక భక్తులు సతీసమేతంగా పూజల్లో పాల్గొన్నారు. ఉభయదారులకు ఆలయ అధికారులు అంగవస్త్రం, రవిక అక్షింతలు, కంకణాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి అక్షింతలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఏఈఓ పార్థసారథి, ఆలయ అధికారి వెంకటరమణ, మణిగండన్, పూజారులు ధన్వంతరి, నరసింహప్రసాద్, తిరుమల దేవస్థానం వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

**నేత్ర ప్రదాయణీ క్షేత్రంలో..**

నేత్ర ప్రదాయణీ క్షేత్రంలో వారం పాటు నిర్వహించిన కుంభాభిషేక వేడుకల్లో సేవలు అందించిన పురోహితులు, ఆలయ సిబ్బందికి వస్త్రాలు, అమ్మవారి ప్రసాదాలను మంత్రి ఆర్కేరోజా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ రామచంద్రయ్య పాల్గొన్నారు.

**కరివరదరాజ ఆలయంలో..**

సత్రవాడలో టీటీడీ ఆధీనంలోని కరివరదరాజ స్వామి ఆలయంలోను కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామిని సుందరంగా అలంకరించి పల్లకిలో ఆలయ ప్రదక్షిణ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కర్పూర హారతులు, కుంకుమ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**దినకరా..శుభకరా..!**

కార్వేటినగరం: స్థానిక రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చనలు, అభిషేకాలు, ఉత్సవర్ల సమర్పణ ఇత్యాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.. అనంతరం ఉత్సవ మూర్తులను పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి, ఉదయం 6 నుంచి 8 గంటలకు చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు నీరాజనాలు సమర్పించారు. రాత్రి 7.45 నుంచి 8 గంటల నడుమ స్వామివారిని పవళింప జేశారు. రథ సప్తమి పురస్కరించుకుని బెంగళూరుకు చెందిన డీ.చక్రవర్తి వాహనం ఊరేగింపు, అలంకరణకు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే తిరుపతికి చెందిన గంగులమ్మ భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ పార్థసారథి, టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేద పండితులు, దాశరథి, గోపాలాచారి, వేదపారాయణులు శివరామకృష్ణ శర్మ, షరాబ్ బాబు సురేష్, పలువురు టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఏడు వాహనాలపై లక్ష్మీనారాయణుడు**



గంగాధరనెల్లూరు: రథసప్తమి సందర్భంగా వేపంజేరిలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి శుక్రవారం ఏడు వాహనాలపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఉదయం సూర్యప్రభ వాహనం, శేష , అశ్వ, హంస, గరుడ, హనుమంత, చంద్రప్రభ వాహనాలపై ఉత్సవ మూర్తులను అధిరోహించి భక్తులకు దర్శనం కలిగించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణు స్వామి, గోవింద స్వామి, ద్వివేది, శేఖర్ స్వామి, గౌరీష్ గర్గ్ పాల్గొన్నారు.

# సచివాలయం.. సేవాలయం



సచివాలయ ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్కేరోజా

- ప్రతి భవనం ప్రజలపై జగనన్నకు ఉన్న అభిమానానికి చిహ్నం
- మంత్రి ఆర్కేరోజా

నగరి: సచివాలయం.. సేవాలయం అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వమూ ఇప్పటివరకు ప్రజావసరాలను వారి గ్రామంలోనే తీర్చే ప్రక్రియ చేపట్టలేదన్నారు. ముఖ్యమంత్రి జగనన్న ఆలోచనలు ఎప్పుడూ ప్రజాసేవపైనే ఉంటాయని, ఈ క్రమంలోనే సచివాలయ వ్యవస్థ పుట్టుకొచ్చిందన్నారు. నేడు సచివాలయాలకు పక్కాభవనాలు కూడా నిర్మిస్తున్నామన్నారు. దీంతో ప్రజలున్న చోటే వారికి సేవలు అందుతున్నాయన్నారు. ప్రతి సచివాలయ భవనం ప్రజలపై జగనన్నకు ఉన్న అభిమానానికి చిహ్నం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీ కన్నియప్ప,ఢిల్లీ, పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఆర్డీకే అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, సర్పంచ్‌లు రవికుమార్, చంద్రకళ, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ హరి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షురాలు మాబూనిషా, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, నాయకులు కుమారస్వామి, అల్లావుద్దీన్, మస్తాన్, ఖాన్‌బాషా, హరి, సత్య, మోహన్‌రెడ్డి, సర్దార్, కృష్ణారెడ్డి, గోకుల్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు అండగా ప్రభుత్వం



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి జ్ఞాపిక అందజేస్తున్న సీడీపీఓ పద్మసునంద

కార్వేటినగరం: అంగన్‌వాడీ ఉద్యోగులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి కె నారాయణస్వామి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మహిళలందరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి, సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని పథకాలను మహిళల పేరుతో అందిస్తున్న ఘనత కూడా జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎంపీపీ లతకు జ్ఞాపికలు అందజేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ తులసి

పాలసముద్రం: రాబోయే ఎన్నికల్లో టీడీపీని ఓడించి, బంగాళాఖాతంలో పడేయడానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ శ్రేణులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ తులసి యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు పొత్తులు లేకుండా ఇప్పటివరకూ ఒక్క ఎన్నికలో కూడా గెలవలేదని గుర్తుచేశారు. వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనులను వివరించి, ఓట్లడగాలని హితవు పలికారు. అలాంటి అభివృద్ధి కార్యక్రమాలేవీ చేయకపోవడం వల్లే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీటీసీ గోవిందరాజ్, వేణు, చంద్ర శేఖర్‌రాజు, భాస్కర్, మనోహర్, సుమన్, రవిరెడ్డి, కుమార్, రాజామణి, షణ్ముగరెడ్డి, ఆనందన్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మోసాలపై స్కూటర్ ర్యాలీ



వెదురుకుప్పం: స్కూటర్‌ర్యాలీ చేస్తున్న నాయకులు, యువత

వెదురుకుప్పం: ప్రజలకు టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో చేసిన మోసాలు, ఇప్పుడు చెబుతున్న అబద్ధపు హామీలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదంతొక్కారు. పేద వాడి సంక్షేమానికి ఆటంకంగా మారిన చంద్రబాబును ఎన్నికల్లో ఓడించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ శుక్రవారం వెదురుకుప్పం మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ఎత్తున స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని దిగువగెరిగదొన నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ టీఆర్‌పురం, పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట, నల్లవెంగనపల్లె, జక్కిదొన, అగ్గిచేనుపల్లె, తిరుమలయ్యపల్లె, పెరుమాళ్లపల్లె మీదుగా వెదురుకుప్పం వరకు స్కూటర్ ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ సంక్షేమం కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి పేదవాని ఇంట్లో జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాల ద్వారా జీవన ప్రమాణాలు మెరుగు పడినట్లు చెప్పారు. చంద్రబాబు నిత్యం ప్రజలను మోసం చేస్తూ తన అధికార దాహం కోసం పచ్చి అబద్ధాలతో మభ్యపెడుతున్నారని చెప్పారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీటీసీ గుణశేఖర్, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, ఏఎంసీ చైర్మన్ మునస్వామి, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్‌ప్రకాష్, ఎంపీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, రోశిరెడ్డి, సర్పంచ్‌లు గోవిందయ్య, రంగారెడ్డి, యువత మండల అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోవిందన్, హేమశేఖర్‌రెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, నాయకులు బొజ్జారెడ్డి, పురందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, జగదీశ్వరరెడ్డి, లోకనాథం, రవి, నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయండి



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకుడు కుమార్‌రెడ్డి

పుత్తూరు: స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కె.కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సమాచార హక్కుల వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస ధర కల్పించడంలోనూ, కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి, నాయకులు వెంకటరత్నం, పొన్నరంగం, శివ, హేమలత, అజీజ్‌బాషా, మునేంద్ర, జాబర్ తదితరులు పాల్గొన్నారు.